






ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం


స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 334 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/-
ఆదివారం 06 జూలై 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# పులులతో కలకలలాడుతున్న నల్లమల ఫారెస్ట్ నాగార్జునసాగర్

# శ్రీ శైలం టైగర్ రిజర్వు ప్రాంతాలు

జూలై 6 (రిపబ్లిక్ న్యూస్): పూజాలతో నల్లమల ఫారెస్ట్ కలకల లాడుతుంది. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ పులులు, ఇతర వన్యప్రాణులకు నిలయంగా మారింది. నల్లమల అడవులు, కొండలు, గుట్టలు, గల గలా పారుతున్న కృష్ణా నది మధ్యన విస్తరించిన ఈ అభయారణ్యం దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుగా పేరొందింది. 1983వ సంసత్సరంలో ఏర్పాటైన ఈ అభయారణ్యంలో పులుల సంఖ్య 87కు పెరిగింది. కోర్, బఫర్ జోన్ ఏరియాతో కలిపి 3727.82 చదరపు కిలోమీటర్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో విస్తరించింది. మార్కాపూర్, ఆత్మకూర్, నంద్యాల, గిద్దలూరు టైగర్ రిజర్వులుగా విభజించారు. రాజీవ్ గాంధీ వన్యప్రాణుల అభయారణ్యం, గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణుల అభయారణ్యంలో పులుల సంచారం పెరిగింది.



## పులులు ఎన్ని ఉన్నాయంటే...

నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో గత ఆరేళ్లలో పులుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని పులుల గణనలో తేలింది. 2018వ సంవత్సరంలో 47 పులులుండగా, 2022 నాటికి వీటి షంఖ్య 74 కు పెరిగింది. 2019లో 63 పులులు, 2020లో 73, 2023లో 74, 2024లో 76 పులులున్నాయని గణనలో వెల్లడైంది. 2025 నాటికి పులుల సంఖ్య 87 కు చేరింది. ఈ ఏడాది చివరిలో జరగనున్న తాజా పులుల గణనలో 2026 నాటికి నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంఖ్య 100కు పైగా ఉండవచ్చని అంచనా వేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

## పులుల పరిరక్షణకు వాచర్ల గస్తీ

నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ లో పులుల కదలికలు, వాటి ఆరోగ్య స్థితి, లింగం, వాటి వయసును అంచనా వేయడానికి అటవీశాఖ అధికారులు కెమెరా ట్రాప్ లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు పులుల సంచారంపై పగ్ మార్కుల ద్వారా కూడా సమాచారాన్ని సేకరిస్తున్నారు. అభయారణ్యంలో పులుల పరిరక్షణకు ప్రొటెక్షన్ వాచర్లు గస్తీ తిరుగుతున్నారు. అభయారణ్యంలోని అయిదు బ్లాకుల్లో 1031 లోకేషన్లలో 2,062 కెమెరాలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు.

## నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ రాయల్ బెంగాల్

నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ రాయల్ బెంగాల్ టైగర్లకు ప్రసిద్ధి చెందింది. పచ్చని చెట్లతో పాటు జంతుజాలంతో అలరారుతోంది. 80 రకాల క్షీరదాలు, 200 జాతుల పక్షులు, 54 రకాల సరీసృపాలు, 20 ఉభయచరాలు, 55 రకాల చేపలు, 101 రకాల రంగురంగుల సీతాకోక చిలుకలు, 45 జాతుల కోలియోప్టెరాన్లు, వివిధ రకాల కీటకాలకు ఈ అభయారణ్యం ప్రసిద్ధి. ఈ అభయారణ్యంలో పులులు, చిరుతలు, మచ్చల జింకలు, సాంబార్లు, చింకారాలు, ఎలుక జింకలు, లంగూర్స్, కింగ్ కోబ్రా, ఎలుక పాము, రస్సెల్ వైపర్ పాములున్నాయి.తెలంగాణలో 200 మీటర్ల దూరం ప్రవహిస్తున్న కృష్ణానదిలో మొసళ్లు, తాబేళ్లు, వివిధ రకాల చేప జాతులు ఉన్నాయి.





## రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యం

రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యాన్ని 1988వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో 9.37 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రోళ్లపాడు విస్తరించి ఉంది. ఈ అభయారణ్యం పక్షులు, సరీసృపాలు, క్షీరదాలకు నిలయంగా ఉంది. అంతరించిపోతున్న జాతులైన గ్రేట్ ఇండియన్ బస్టర్డ్, లెస్సర్ ఫ్లోరికాన్‌లకు నిలయంగా రోళ్లపాడు ప్రసిద్ధి చెందింది. రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యం దేశంలో అత్యంత అంతరించిపోతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ సంరక్షణ కోసం ఉద్దేశించారు. ప్రకృతి పరవశించేలా పచ్చని చెట్లతో కూడిన రోళ్లపాడు అభయారణ్యంలో జింకలు, తోడేళ్లు, వివిధ రకాల పక్షులు ఉన్నాయి. పక్షుల కిలకిల రావాలతో రోళ్లపాడు మార్మోగుతుంటుంది. రోళ్లపాడు అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకులకు రెండు ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ఇద్దరు వ్యక్తులకు రాత్రి బస, లంచ్, డిన్నర్, అల్పాహారం, గ్రాస్ ల్యాండ్ సఫారీతో కలిపి రూ.4వేలు ధర నిర్ణయించారు.



**అభయారణ్యంలో బర్డ్ వాచింగ్:** నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ లో అద్భుతమైన పక్షి జాతులకు నిలయంగా మారింది. ఉదయం వేళ పర్యాటకులు రంగురంగుల పక్షులను తిలకించవచ్చు. చేంజబుల్ హాక్ ఈగిల్, కామన్ టైలర్‌బర్డ్స్, ఓరియంటల్ మాగ్పీ రాబిన్స్, ఇండియన్ స్మిటార్ బాబ్లర్, పఫ్ త్రోటెడ్ బాబ్లర్, వైట్ రంప్డ్ షామా, జంగిల్ బాబ్లర్స్, రెడ్ వాట్లేడ్ లాప్‌వింగ్స్, గ్రీన్ ఇంపీరియల్ పావురాలు, వైట్ బెల్లీడ్ డ్రోంగోస్, గ్రే హార్న్‌బిల్స్, ఇండియన్ రోలర్స్, రూఫస్ ట్రీపీస్, ప్యారడైజ్ ఫ్లైక్యాచర్స్, పారాకీట్స్, ఇండియన్ పీఫౌల్, గ్రే జంగిల్‌ఫౌల్, ఇతర పక్షులను చూడవచ్చు. వివిధ రకాల పక్షుల అరుపులను వినవచ్చు. పక్షులను చూసేందుకు పక్షి ప్రేమికులు బర్డ్ వాచింగ్ వాక్ చేస్తుంటారు. ప్రస్తుతం 3 నెలలపాటు బర్డ్ వాచింగ్ అధికారులు నిలిపివేశారు.

## బైర్లుటి నల్లమల జంగిల్ క్యాంప్


కర్నూలు, నంద్యాల, విజయవాడ, హైదరాబాద్ నగరాలకు సమీపంలో బైర్లుటి నల్లమల జంగిల్ క్యాంప్ సెలవులను ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు అనువుగా ఉంది. ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వీలుగా కుటీరాల్లో పర్యాటకులు బస చేయవచ్చు. థ్రిల్లింగ్ జంగిల్ సఫారీలు, రిఫ్రెష్ ఎకో వాక్స్ విశ్రాంతితో పాటు సాహస యాత్రలు చేయవచ్చు. పచ్చచెట్ల మధ్య బస చేయడంతోపాటు గైడెడ్ సఫారీ రైడ్ ల చేపట్టవచ్చు. ఈ రైడ్ కార్పొరేట్ రిట్రీట్‌లు, టీమ్-బిల్డింగ్ కార్యకలాపాలు, కుటుంబ కలయికలు, ప్రత్యేక వేడుకలకు ఇది సరైన ప్రదేశం. నల్లమల అడవుల్లో పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ పక్షుల కిలకిల రావాల మధ్య గడపవచ్చు. సఫారీ రైడ్ లో పులులు, చిరుతలు, అడవి కుక్కలు, జింకలు, పెద్ద ఉడతలు మరుపురాని మధుర అనుభూతులను మిగిలిస్తాయి. ఈ అభయారణ్యం వలస పక్షులకు నిలయం కావడంతో పక్షి వీక్షకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పులుల సంతానోత్పత్తి దృష్టిలో పెట్టుకొని జంగిల్ క్యాంపులను తిలకించేందుకు అటవీశాఖ అధికారులు రద్దు చేశారు.




**వన్యప్రాణుల పరిరక్షణ కోసం:** వన్యప్రాణుల పరిరక్షణ కోసం అటవీశాఖ అధికారులు గుంటూరు నుంచి కర్నూల్, నంద్యాల, శ్రీశైలం ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కార్లు, టెంపో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. రాత్రివేళల్లో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు భారీవాహనాలు, బస్సులు, ట్రక్కుల రాకపోకలు నిలిపివేశారు. డోర్నాల, శిఖరం, లింగాలగుట్ట వద్ద అటవీశాఖ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో ఆకురాల్చే వృక్షాలున్నాయి. లోయలు, కొండలు, గుట్టలతో వెదురు, గడ్డితో అటవీ ప్రాంతం నిండి ఉ ంటుంది. నల్లమలలో మూలికలు కూడా ఉన్నాయి. వివిధ రకాల చెట్లు ఔషధమొక్కలకు నల్లమల నిలయంగా మారింది.

## జాలువారుతున్న జలపాతాలు

నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలో నల్లమల కొండలు, కోనల నడుమ ఎత్తిపోతల, పెద్ద దూకుడు, గుండం, చలేశ్వరం జలపాతాలున్నాయి. అమ్రాబాద్, శ్రీశ్రైలం, పెద్ద చెరువు, శివపురం, నెక్కంటో పీఠభూములున్నాయి. శ్రీశైలంలోని పురాతన దేవాలయాలు మళికార్జున స్వామి, ఆయన భార్యలైన దేవత భ్రమరాంబ, పార్వతి దేవతల తలంబ్రాలున్నాయి. భారతదేశంలోని పన్నెండు పవిత్ర జ్యోతిలింగాల్లో ఒకటిగా. పద్దెనిమిది మహాశక్తి పీఠాల్లో ఒకటిగా నిలచింది. నాగార్జున విశ్వవిద్యాలయం, బౌద్ధమత విశ్వవిద్యాలయాలు, మఠాలకు ఈ ప్రాంతం నిలయంగా మారింది. గల గల పారుతున్న కృష్ణానది ఈ టైగర్ రిజర్వ గుండా 270 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అక్క మహాదేవి భిలం, దత్తాత్రేయ భిలం, ఉమా మహేశ్వరం, కదలివనం, పలంకసరి వంటి రాతి ఆశ్రయాలు, గుహ దేవాలయాలు ఉన్నాయి.






## హిమాచల్ ప్రదేశ్లో రెడ్ అలర్ట్.. 75కు చేరిన మృతులు



**జూలై 6, (రిపబ్లిక్ న్యూస్):** హిమాచల్ ప్రదేశ్లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 75కు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం.. మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా ఉంది. చాలా చోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి. హిమాచల్ ప్రదేశ్లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. రెడ్ అలర్ట్ జారీ.. హిమాచల్ ప్రదేశ్లోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని హెచ్చరించింది. ఉనా, బిలాస్పూర్, హమిర్పూర్, చంబా, శిమ్లా, కుల్లు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. ఐటీబీపీ దళాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. దీనికి తోడు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ సాయం తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రభుత్వానికి సూచించారు.

## పాశమైలారం ఘటన.. 42కి చేరిన మృతులు

**పాశమైలారం, జూలై 6, (రిపబ్లిక్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 42కి చేరింది. ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం జితేందర్ తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదంలో గల్లంతైన తొమ్మిది మందిలో ఒకరి శరీర భాగాలు లభ్యమయ్యాయి. ఇంకా 8 మంది కార్మికుల ఆచూకీ తెలియాల్సి ఉంది. పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం శిథిలాల తొలగింపు జరుగుతోంది. ఇక్కడ ఏడో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.




## ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిన టీచర్లకు అభినందనలు:మంత్రి లోకేశ్

**అమరావతి, జూలై 6, (రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిన టీచర్లకు ఏపీ మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 'ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చదివిస్తున్న టీచర్లకు అభినందనలు. ప్రైవేటు విద్యాసంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేద్దాం. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు మధుబాబు, రాజేంద్రప్రసాద్, కరుణాకర్రావుకు హ్యాట్సాఫ్" అని తెలిపారు.



## దలైలామా శాంతికి రూపం:ప్రధాని మోదీ






**జూలై 6, (రిపబ్లిక్ న్యూస్):** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా శాంతికి రూపమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బౌద్ధ ఆధ్యాత్మిక గురువు జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని ఎక్స్లో పోస్టు పెట్టారు. "పవిత్ర ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా 140 కోట్ల మందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన బలమైన చిహ్నం. మతాలకు అతీతంగా ఆయనిచ్చే సందేశం ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఆధ్యాత్మిక గురువు దలైలామాకు 90వ జన్మదిన శుభాకాంక్షలు. సమైక్యత, శాంతి, కరుణ సందేశాలతో ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలి" అని తన సందేశంలో ఆకాంక్షించారు. మరోవైపు 90వ పుట్టిన రోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ "మానవతా విలువలు, మత శాంతి ప్రచారం చేయడానికి నేను కట్టుబడి ఉంటాను. టిబెట్ సంస్కృతి ప్రపంచానికి మానసిక ప్రశాంతత, కరుణను అందిస్తుంది" అని పేర్కొన్నారు. ఇటీవల తన వారసుడి ఎంపికపై దలైలామా కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్టు మాత్రమే ఉ ందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. దీంతో ఈ విషయం చైనాకు ఆగ్రహం తెప్పించింది. తమ ఆమోదముద్ర తప్పనిసరి అని తేల్చిచెప్పింది. మరో వైపు భారత్ మాత్రం లామాకు తమ మద్దతు ప్రకటించింది.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- మలావి స్వాతంత్ర్య దినోత్సవం.
- 1901 : జనసంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షుడు, కోల్‌కతా విశ్వవిద్యాలయం మాజీ కులపతి, మాజీ కేంద్ర మంత్రి శ్యాంప్రసాద్ ముఖర్జీ జననం (మ.1953).
- 1930 : కర్ణాటక సంగీత విద్వాంసుడు, కవి, వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జననం (మ.2016). (చిత్రంలో)
- 1935 : టిబెట్ దేశీయుల మతగురువు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, 14వ దలైలామా జన్మించాడు.
- 1946 : అమెరికన్ నటుడు, చిత్ర నిర్మాత, రచయిత, సినిమా దర్శకుడు సిల్వెస్టర్ స్టాలోన్ జననం.
- 1986 : భారత స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, దేశానికి ఉపప్రధానిగా పనిచేసిన జగ్జీవన్ రాం మరణం (జ.1908).
- 1885 : లూయీ పాశ్చర్ తయారు చేసిన యాంటి రేబీస్ వాక్సిన్ ని మొట్టమొదటి సారిగా వాడారు. నేడు ప్రపంచ జంతుకారక వ్యాధి దినోత్సవం ప్రపంచ రేబిస్ దినోత్సవం


మలావి స్వాతంత్ర్య దినోత్సవం



శ్యాంప్రసాద్ ముఖర్జీ


బాలమురళీకృష్ణ


దలైలామా


సిల్వెస్టర్ స్టాలోన్


జగ్జీవన్ రాం


లూయీ పాశ్చర్

## తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా.. వైల్డ్ ఫైర్..: అల్లు అర్జున్



అమెరికా వేదికగా జరిగిన 'నాట్స్ 2025' కార్యక్రమంలో తెలుగు సినీ తారలు సందడి చేశారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, దర్శకుడు సుకుమార్, నటుడు అల్లు అర్జున్, నటి శ్రీలీల పాల్గొన్నారు. అమెరికాలో ఉంటున్న తెలుగు వారిని ఉద్దేశించి మాట్లాడారు. విదేశాల్లోనూ తెలుగు వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటూ కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి 'పుష్ప' స్టైల్లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు అల్లు అర్జున్. 'తెలుగు వారంటే ఫైర్ అనుకున్నారా.. వైల్డ్ ఫైర్' అంటూ తనదైన స్టైల్లో డైలాగ్ చెప్పారు. "ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. ఎప్పుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఆశ్చర్యానికి గురి అవుతుంటా. ఇంతమంది తెలుగు వారిని చూస్తుంటే హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నట్లు అనిపిస్తుంది. అమెరికాలో మనమంతా ఇలా కలవడం అదృష్టంగా భావిస్తున్నా. నన్ను ఇలాంటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్‌కు ధన్యవాదాలు. నాట్స్ గురించి సరదాగా 'పుష్ప' స్టైల్లో చెప్పాలంటే 'నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్'. మన తెలుగు కల్చర్ను ముందు తరాలకు తీసుకువెళ్తున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే.. అందులోనూ తెలుగోళ్లు అస్సలు తగ్గేదేలే" అని అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. "ఇది నా 50 ఏళ్ల దర్శక ప్రస్థానం. ఈ సందర్భంగా నేను పరిచయం చేసిన అల్లు అర్జున్, శ్రీలీల ఇక్కడ ఉన్నందుకు ఆనందంగా ఉంది. సుకుమార్ కు నాకు మధ్య ఒక పోలిక ఉంది. అదే గడ్డం (నవ్వులు). నేను 'అడవి రాముడు'లో అడవిని నమ్ముకున్నా స్టార్ డైరెక్టర్ అయ్యా. నువ్వు (సుకుమార్ని ఉద్దేశించి) 'పుష్ప'లో అడవిని నమ్ముకున్నావు స్టార్ డైరెక్టర్ అయ్యావు. బన్నీని స్టార్ హీరోని చేశావు" అని అన్నారు."అమెరికాలోని తెలుగువారందరికీ నేనెంతో రుణపడి ఉన్నా. ముఖ్యంగా రెండు విషయాల్లో కృతజ్ఞతలు చెప్పాలి. '1 నేనొక్కడినే' చిత్రాన్ని మీరందరూ ఇక్కడ ఆదరించడం వల్ల నాకు వేరే సినిమా అవకాశం వచ్చింది. అది నా కెరీర్కు ఎంతో ప్లస్ అయింది. మరో విషయం ఏమిటంటే.. తెలుగు చిత్రపరిశ్రమకు నవీన్ న్ను నిర్మాతగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ సంస్థ ఎన్నో సినిమాలు తెరకెక్కించి ఎంతో మందికి ఉపాధి కల్పించింది" అని సుకుమార్ తెలిపారు.

## నాకొక ఐడెంటిటీ ఇచ్చారు..:స్టేజ్ పై సమంత ఎమోషనల్



నటి సమంత తానా వేడుకల్లో పాల్గొన్నారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమ పట్ల భావోద్వేగానికి గురయ్యారు. "తానా వేడుకల్లో పాల్గొనడానికి 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏడాది తానా, ఇక్కడ ఉన్న తెలుగువారి గురించి వింటూనే ఉంటాను. నా తొలి చిత్రం 'ఏమాయ చేసావె' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్ని ఏళ్లు పట్టింది" అంటూ శిరస్సు వంచి నమస్కారం చేశారు. "కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించా. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు మా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మంచి ఫలితాన్ని అందించారు. జీవితంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఏదైనా తప్పు చేసినా.. మీరు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. అందుకు గర్వపడుతున్నా. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా.. 'తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడతారా? లేదా? అనే ఆలోచిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు. మీరు నాకొక ఐడెంటిటీ, కుటుంబాన్ని ఇచ్చారు. 'ఓబేబీ' మిలియన్ డాలర్ క్లబ్లోకి చేరడం మీవల్లే సాధ్యమైంది. ప్రాంతాలను బట్టి మీరు నాకు దూరంగా ఉండొచ్చు.. కానీ మీరెప్పటికీ నా మనసులోనే ఉంటారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## విజయ్ రూల్ మిగిలిన హీరోలూ ఫాలో అయితే నిర్మాతలకు సువర్ణావకాశం:దిల్ రాజు



కోలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ పనితీరుపై ప్రశంసలు కురిపించారు. నిర్మాత దిల్ రాజు. పని రోజుల విషయంలో విజయ్ క్లారిటీగా ఉంటారని చెప్పారు. సినిమాకు సంబంధించి ఇన్ని రోజులు కేటాయించగలనని ఆయన ముందే చెప్పేస్తారని, మిగిలిన హీరోలూ ఇలాంటి పద్ధతి అనుసరిస్తే బాగుంటుందన్నారు. "విజయ్ వర్కింగ్ స్టైల్ భిన్నంగా ఉంటుంది. షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతారు, ఎప్పుడు పూర్తి చేస్తారు అనే విషయంపై క్లారిటీగా ఉంటారు. అందుకు అనుగుణంగా ఇన్ని రోజులు కేటాయిస్తానని ముందే చెప్పేస్తారు. సినిమాకు మొత్తం 120 రోజులు అవసరమైతే.. ప్రతి నెలా 20 రోజులు కేటాయిస్తానని చెప్పేస్తారు. దీని వల్ల అనుకున్న సమయానికి సినిమా పూర్తవుతుంది. ఇలాంటి ఆలోచనను ఇతర హీరోలూ ఫాలో అయితే.. నిర్మాతలకు అదొక సువర్ణావకాశం అవుతుంది. ప్రీ ప్రొడక్షన్ కోసం ఇంకాస్త ఎక్కువ సమయం తీసుకుని ఆరు నెలల్లో సినిమా షూట్ పూర్తి చేస్తారు" అని దిల్ రాజు అన్నారు. "ప్రతి నెలా 15 లేదా 20 రోజులు ఇచ్చేసి.. మీరు ఏదైనా ప్లాన్ చేయండి అని చెబితే టీమ్ అందరిపై ఒక పాజిటివ్ ప్రెజర్, బాధ్యత పెరుగుతుంది. అలా ముందుగా అనుకున్నట్లుగా సినిమా షూట్ అవుతుంది. డేట్స్కు సంబంధించి టాలీవుడ్లో ప్రస్తుతం ఈ పద్ధతి ఎక్కడా కనిపించడం లేదు. తిరిగి ఇలాంటి పరిస్థితులు తీసుకొచ్చేందుకు మేము వర్క్ చేస్తున్నాం" అని దిల్ రాజు తెలిపారు. విజయ్ హీరోగా దిల్ రాజు 'వారిసు' / 'వారసుడు' చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. 2023లో ఈ సినిమా విడుదలై మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఆయన నిర్మాతగా వ్యవహరించిన తాజా చిత్రం 'తమ్ముడు'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇండస్ట్రీలో కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'దిల్ రాజు డ్రీమ్స్' పేరుతో నూతన నిర్మాణ సంస్థను ఆయన ప్రారంభించారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ఆ మాత్రం ఆలోచించని 'సమూర్ఖులం' కాదు :ఇంగ్లాండ్ బ్యాటింగ్ కోచ్



ఎడ్జ్‌బస్టన్ వేదికగా జరుగుతోన్న టెస్టు మ్యాచ్లో ఇంగ్లాండ్ గెలవాలంటే చివరి రోజు ఇంకా 536 పరుగులు చేయాలి. ఇప్పటికే మూడు వికెట్లు కోల్పోయింది. ఇలాంటప్పుడు కూడా ఇంగ్లాండ్ ఆచితూచి ఆడి డ్రా చేసుకుంటుందా? తమదైన 'బజ్బాల్ ఆటనే కొనసాగిస్తుందా..? ఈ ప్రశ్నలకు ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ మార్కస్ ట్రెస్కోథిక్ సమాధానం ఇచ్చాడు. ఇంగ్లాండ్ వైస్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ చేసిన వ్యాఖ్యలకు విరుద్ధంగా 24 గంటల వ్యవధిలోనే ట్రెస్కోథిక్ భిన్నంగా స్పందించాడు. "మాతో పోలిస్తే ఇప్పుడున్న జట్టు డ్రెస్సింగ్ రూమ్ భిన్నమైంది. అయితే, ఇలాంటి సమయంలో డ్రా గురించి కూడా ఆలోచించని 'స్టుపిడ్స్' మేం కాదని అనుకుంటున్నా. ప్రతి టెస్టులో మూడు రకాల ఫలితాలకు ఆస్కారం ఉంది. గెలుపు, ఓటమి లేదా డ్రాగా ముగియడం. ఇది కఠిన సవాల్ కూడుకున్న టార్గెట్ అని తెలుసుకోలేనంత అమాయకులం కాదు. మాకు భారత్ 550 పరుగులను లక్ష్యంగా నిర్దేశిస్తుందని భావించాం. కానీ, టీమ్ ఇండియా 600ం ఇచ్చింది. ఇక ఒక్క రోజులో ఇప్పుడు మేం 536 పరుగులు చేయాలి. భారత ఇన్నింగ్స్లో బంతి సాఫ్ట్ మారిన తర్వాత 10 నుంచి 15 ఓవర్లపాటు ఎక్కువగానే బౌలింగ్ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. భారత్ ముందే డిక్లేర్డ్ చేస్తుందని భావించాం. అక్కడ టీమ్ ఇండియా వేగంగా పరుగులు రాబట్టింది. ఇక బ్యాటింగ్ సమయంలో మేం ఎలా ఆడతామనేదే ఇక్కడ కీలకం. పాజిటివ్ ఫలితం కోసమే ప్రయత్నిస్తాం" అని మార్కస్ వెల్లడించాడు. "భారత్ నిర్దేశించే ఎంత లక్ష్యాన్నైనా మేం ఛేదిస్తాం" అని బ్రూక్ నాలుగో రోజు ఆట ముందు వ్యాఖ్యానించాడు.

### వాతావరణం ఎలా ఉండనుందంటే?

నాలుగో రోజు గిల్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బ్రూక్ 'ఐదో రోజు వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. సగం రోజు వృథా అవుతుంది' అని వ్యాఖ్యానించాడు. ఒకవేళ అదే జరిగితే ఇంగ్లాండు ప్రయోజనంగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలో బర్మింగ్హామ్లోని ఎడ్జ్‌బస్టన్ స్టేడియం వద్ద వాతావరణం ఎలా ఉందంటే..? మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవుతుంది. అంటే అక్కడ ఉదయం 11 గంటలు అవుతుంది. మ్యాచ్ మొదలుకావడానికి గంట ముందు వరకు చిన్నపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. మ్యాచ్ ప్రారంభమైన తర్వాత వాతావరణం సాధారణ స్థాయికి చేరుకుంటుందని ఆక్యూ వెదర్ రిపోర్ట్ చెబుతోంది. అంటే ఆటకు వరుణుడు ఎలాంటి ఆటంకం కలిగించడనే అర్థం.

## అందం

### కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్‌తో చూడ్డానికే ఇబ్బందిగా మారాయా, కొన్ని పదార్థాలతో కాసేపు మసాజ్ చేస్తే సమస్య మాయం

కంటిచుట్టూ నల్లని వలయాలు రావడానికి చాలానే కారణాలు ఉంటాయి. అయితే, ఇవి రావడం వల్ల చూడ్డానికి అంతగా బాగోవు. వీటిని తగ్గించేందుకు ఎలాంటి టిప్స్ హెల్ప్ చేస్తాయో తెలుసుకోండి.

నీరసం, స్ట్రెస్, పెరిగిన వయసు, జెనెటిక్స్ ఇలా చాలా కారణాల వల్ల కంటి చుట్టూ నల్లని వలయాలు వస్తాయి. ఇవి అంత ప్రమాదకరం కానప్పటికీ చూడ్డానికి మాత్రం కాస్తా ఇబ్బందిగానే కనిపిస్తాయి. ఈ సమస్యని తగ్గించేందుకు చాలా రకాల ట్రీట్‌మెంట్స్ ఉన్నాయి. అందులో కొన్ని ఇంటి చిట్కాలు కూడా. ఈ ఇంటి చిట్కాల కారణంగా డార్క్ సర్కిల్స్ కాస్తా లైటెన్ అవుతాయి. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.



### రోజ్ వాటర్



రోజ్ వాటర్ కూడా నల్లని వలయాలని దూరం చేసేందుకు హెల్ప్ చేస్తుంది. ఇందులో విటమిన్ ఎ, సిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కళ్ల కింద నల్లదనాన్ని తగ్గించేందుకు హెల్ప్ చేస్తుంది. దీనికోసం రోజ్‌వాటర్‌లో దూదిని ముంచి కళ్లపై ఉంచి కాసేపు అలానే ఉంచండి. తర్వాత కాటన్ తీసేయండి. కానీ, కళ్లు కడగకూడదు. రోజూ లా చేస్తే మంచి మంచి రిజల్ట్ ఉంటుంది.

### దోస, నిమ్మరసం



నిమ్మరసంలో మంచి బ్లీచింగ్ గుణాలు ఉంటాయి. దీనిని అప్లై చేయడం వల్ల కూడా సమస్య తగ్గుతుంది. అయితే, దీనిని నేరుగా రాయొద్దు. అందులో కొద్దిగా దోస రసం, చిటికెడు పసుపు కలిపి రాయండి. నిమ్మరసం మరీ ఎక్కువగా వాడకూడదని గుర్తుంచుకోండి.

### విటమిన్ ఇ ఆయిల్



విటమిన్ ఇ అనేది మంచి పోషకం. దీనిని మనం బ్యూటీ ప్రోడక్ట్స్‌లో వాడతాం. విటమిన్ ఇ ఆయిల్‌ని వాడడం వల్ల సమస్య తగ్గుతుంది. అయితే, నేరుగా రాయొద్దు. ఇందులో కొద్దిగా కొబ్బరినూనె, ఆలివ్ నూనెల్ని కలిపి ఆ తర్వాత ఆ నూనెల్ని నిదానంగా వేళ్లతో మసాజ్ చేయండి.

### మంచి నిద్ర



నిద్రలేకపోవడం వల్ల మీ కళ్ల కింద ఉబ్బరం, నల్లని వలయాలు ఏర్పడతాయి. కాబట్టి, రోజూ రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు మంచి నిద్ర ఉండేలా చూసుకోండి. నిద్రకి ముందు ఆల్కహాల్ తీసుకోవద్దు. దీంతో కూడా నిద్రసమస్యలొచ్చి డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి.

### అలర్జీలు తగ్గించుకోండి



చాలా మంది సీజనల్‌గా చాలా అలర్జీలు వస్తుంటాయి. దీని వల్ల కూడా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడతాయి. ముక్కు దిబ్బడని ప్రేరేపించే అలర్జీలు ఉంటే తుమ్ము, ముక్కు కారడం వంటి లక్షణాలు తగ్గించేందుకు ట్రై చేయండి. దీంతో కళ్లు ఎర్రబడడం, వాపు ఉంటాయి. వీటన్నింటిని తగ్గిస్తే సమస్య దూరమవుతుంది.

### శనగపిండి



నగపిండి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో బాగా పనిచేస్తుంది. ఓ స్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, మరికాస్తా టమాట రసం వేసి బాగా పేస్టులా చేయండి. దీనిని కళ్ల చుట్టూ అప్లై చేయండి. ఆరిన తర్వాత క్లీన్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే సమస్య చాలా వరకూ తగ్గుతుంది.



**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.